ఉపాధి పనులను పరిశీలించి కూలీలతో మాట్లాడుతున్న రాంభూపాల్

'ఉపాధి' బిల్లుల చెల్లింపులో జాప్యం

మౌలిక వసతుల కల్పనలోనూ నిర్లక్ష్యం
సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్

ప్రజాశక్తి-కళ్యాణదుర్గం టౌన్

ఉపాధి పనుల్లో కూలీలు రెక్కలుముక్కలు చేసుకుని పనులు చేస్తున్నా కూలి చెల్లింపులో తీవ్ర జాప్యం జరుగుతోందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు వి.రాంభూపాల్ తెలియజేశారు. కళ్యాణదుర్గం మండల పరిధిలోని యర్రంపల్లి, గరుడాపురం, శెట్టూరు మండలం యాటకల్లు గ్రామాల్లో ఉపాధి హామీ పనులను సిపిఎం బృందం బుధవారం పరిశీలించింది. కూలీలతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. కూలి చెల్లింపులో జాప్యం జరుగుతోందని, పనులు చేస్తున్న చోటా ఎలాంటి మౌలిక సదుపాయాలూ లేవని కూలీలు వాపోయారు. ఈ సందర్భంగా రాంభూపాల్ మాట్లాడుతూ యాటకల్లు గ్రామంలో జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు 10, గరుడాపురంలో 6 వారాలుగా బిల్లులు ఇవ్వడం లేదన్నారు. పనులు చేసేందుకు ఉపయోగించే గణపాలు పదను పెట్టడానికి రూ.60 నుంచి 100 రూపాయలను కూలీలు సొంత ఖర్చులు భరించాల్సి వస్తోందన్నారు. పది వారాలుగా బిల్లులను చెల్లించకపోతే కూలీల కుటుంబ జీవనం ఎలా కొనసాగుతుందని ప్రశ్నించారు. ఓ వైపు బిల్లులు పడక ఇబ్బందులు పడుతున్న కూలీలను పని దినాలు పూర్తయ్యాయన్న సాకుతో పనులు నిలిపేస్తుండడం మరింత ఇబ్బందులకు గురి చేస్తోందని చెప్పారు. ఇప్పటికైనా జిల్లా అధికార యంత్రాంగం, ప్రజాప్రతినిధులు ఉపాధి కూలీల సమస్యలపై స్పందించాలన్నారు. పెండింగ్ బిల్లులు అన్నింటినీ వెంటనే చెల్లించాలన్నారు. పనులు చేస్తున్న చోట మౌలిక సదుపాయాలు కల్పించాలన్నారు. పని దినాలు పెంచి కూలీలకు ఉపాధి చూపాలని కోరారు. రోజు కూలి రూ.600 ఇవ్వాలన్నారు. పని ప్రదేశంలో ఫస్ట్ ఎయిడ్ కిట్లు ఏర్పాటు చేయాలన్నారు. ఎండను దృష్టిలో ఉంచుకుని మజ్జిగ, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు అచ్యుత్ ప్రసాద్, నాయకులు రంగనాథ్, రఘు, వంశీ, సోము, మూర్తి, శివ పాల్గొన్నారు.

కార్మికులకు మూడు రోజుల్లో వేతనాలు చెల్లించాలి

కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీ నరసయ్య
ప్రజాశక్తి కథనానికి స్పందన

వివరాలు వెల్లడిస్తున్న అధికారి లక్ష్మినరసయ్య

ప్రజాశక్తి-హిందూపురం

హిందూపురం రూరల్ మండలం గోళాపురం పారిశ్రామిక వాడలో ఉన్న ఓస్వెల్ స్మెల్టర్స్ స్టీలు పరిశ్రమలో వలస కార్మికులకు మూడు రోజుల్లోపు వేతనాలు చెల్లించాలని కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీ నరసయ్య ఆదేశించారు. వలస కార్మికులకు జరుగుతున్న అన్యాయంపై దగాపడ్డ వలస కార్మికులు అనే శీర్షికన ప్రజాశక్తి దినపత్రికలో బుధవారం ప్రచురితమైన కథనానికి అధికారులు స్పందించారు. కార్మిక శాఖ డిప్యూటీ కమిషనర్ లక్ష్మీ నరసయ్య బుధవారం పరిశ్రమను ఆకస్మిక తనిఖీ చేశారు. పరిశ్రమలో ఎంత మంది కార్మికులు పనిచేస్తున్నారు, స్థానికులు ఎంతమంది ఉన్నారు, వలస కార్మికులు ఎంతమంది ఉన్నారు, వీరిని ఏ గుత్తేదారుడి ద్వారా నియామకాలు చేసుకున్నారు, ప్రతినెల వేతనాలు ఎంత ఇస్తున్నారు తదితర విషయాలను పరిశ్రమ యాజమాన్యం నుంచి సేకరించారు. దీంతో పాటు పలు రికార్డులను పరిశీలించారు. అనంతరం డిప్యూటీ కమిషనర్ లక్ష్మీ నరసయ్య మాట్లాడుతూ గుత్తేదారుడి ద్వారా నియమించుకున్న 24 మంది కార్మికులకు వేతనాలు ఇవ్వలేదని పరిశీలనలో తేలిందన్నారు. వీరందరికీ మూడు రోజుల్లో వేతనాలు కార్మికుల ఖాతాల్లో జమ చేయాలని ఆదేశించామన్నారు. అలా చేయని పక్షంలో పరిశ్రమ యాజమాన్యంపై కార్మిక శాఖ నిబంధనల మేరకు చర్యలు తీసుకుంటామని హెచ్చరించినట్లు తెలిపారు. పరిశ్రమల్లో విధులు నిర్వహించే కార్మికులకు యాజమాన్యాలు అన్యాయం చేయాలని చూస్తే సహించే ప్రసక్తి ఉండదన్నారు. ప్రతి పరిశ్రమ నిర్వాహకులు కార్మిక శాఖ నిబంధనల మేరకు పరిశ్రమలను నిర్వహించుకోవాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే వారికి ఎంతటి పలుకుబడి ఉన్నా సహించే ప్రసక్తే లేదని వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఈ పరిశీలనలో స్థానిక సహాయ కార్మిక శాఖ అధికారి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ విత్తనం.. అన్నదాతకు కష్టం..!

నష్టం భరించలేక రైతు ఆత్మహత్యాయత్నం

ప్రజాశక్తి-అనంతపురం

కల్తీ విత్తనం రైతుకు నష్టాన్ని మిగిల్చింది. కళింగర విత్తనం కొనుగోలు చేసి పంట సాగు చేస్తే దిగుబడి రాలేదు. తనకు జరిగిన నష్టం గురించి ఎవరికి చెప్పుకున్నా స్పందన లేకపోవడంతో పురుగుల మందు సేవించి ఆత్మహత్యాయత్నానికి రైతు పాల్పడిన ఘటన బుధవారం నాడు అనంతపురం నగరంలో చోటు చేసుకుంది. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి... సత్యసాయి జిల్లా బత్తలపల్లి మండలం డి.చెర్లోపల్లి గ్రామానికి చెందిన రైతు మురళీ గతేడాది నవంబరు 27వ తేదీన అనంతపురం నగరంలోని ఆర్టీసీ బస్టాండు సమీపంలోని శ్రావణి ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో కిలో రూ.50 వేల చొప్పున కళింగర విత్తనాన్ని ఒకటిన్నర కిలో కొనుగోలు చేశాడు. రూ.75 వేలు పెట్టి విత్తనం కొని నాలుగున్నర ఎకరాల్లో పంటను సాగు చేశాడు. ఈ పంట ఏ మాత్రం దిగుబడి రాలేదు. కల్తి విత్తనంతో నష్టపోయానని గ్రహించి సమస్యను విత్తనం కొనుగోలు చేసిన శ్రావణి ఎంటర్ ప్రైజెస్ అధినేత మధుసూదన్ గుప్తా దృష్టికి తీసుకెళ్లాడు. అయితే ఆయన నుంచి ఎటువంటి స్పందన లేకపోవడంతో అనంతపురం నగరంలోని వన్‌టౌన్ పోలీసు స్టేషన్, బత్తలపల్లి పోలీసు స్టేషన్‌లో బాధిత రైతు మురళీ ఫిర్యాదు చేశాడు. తనకు నాణ్యతలేని విత్తనం అంటగట్టడంతో నష్టపోయాయని అధికారుల దృష్టికి తీసుకెళ్లినా ఫలితం లేదు. మరోమారు మధుసూదన్ గుప్తా వద్దకే బుధవారం నాడు రైతు వచ్చాడు. తనగోడు వెళ్లబోసుకోబోతే... 'నీవు ఎవరి వద్ద ఫిర్యాదు చేసినా..ఏమీ చేసుకోలేవంటూ.. అవమానపరిచే విధంగా మాట్లాడంతో మనస్థాపం చెంది రోగోర్ పురుగుల మందును సేవించి ఆత్మహత్యాయత్నంకు ప్రయత్నించాడు. తోటి రైతులు గుర్తించి ఆయన్ను ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఆరోగ్యం కొంత నిలకడగానున్నట్టు వైద్యులు చెబుతున్నారు. ఈ విషయం తెలియగానే మండల వ్యవసాయాధికారి శశికళ ఆసుపత్రికి చేరుకుని వివరాలను సేకరించారు.

ఆత్మహత్యకు యత్నించిన రైతు వివరాలు తెలుసుకుంటున్న వ్యవసాయ అధికారులు

వ్యాపారిపై చర్యలు తీసుకోవాలి

కల్తీ విత్తనం అమ్మి రైతులను మోసం చేసే వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలి. ప్రస్తుతం ఆత్మహత్యకు యత్నించిన రైతుకు నష్టపరిహారం చెల్లించే విధంగా అధికారులు చర్యలు తీసుకోవాలి. నకిలీ విత్తన సమస్య తరచూ జిల్లాలో వెలుగు చూస్తూనే ఉన్నాయి. వాటిపై వ్యవసాయాధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టి చర్యలు తీసుకోవాల్సిన అవసరముంది.

చంద్రశేఖర్‌రెడ్డి, ఎపి రైతు సంఘం
జిల్లా ప్రధాన కార్యదర్శి, అనంతపురం.

మహిళలకు ఉచిత కుట్టు శిక్షణ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

మహిళల స్వయం ఉపాధి కోసం అర్హులైన వారికి జిల్లా వెనుక బడిన తరగతుల అభివృద్ధి శాఖ నుంచి ఉచితంగా శిక్షణ ఇచ్చి కుట్టుమిషన్లు అందజేస్తున్నట్లు ధర్మవరం ఎంపిడిఒ సాయి మనోహర్ తెలిపారు. ఈ మేరకు ఆయన బుధవారం ఒక ప్రకటన విడుదల చేశారు. 2024-25 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గానికి 3 వేల చొప్పున కుట్టు మిషన్లు ఉచితంగా పంపిణీ చేస్తామని తెలిపారు,మార్చి 8 తేది నుండి 22 తేది వరకు దరఖాస్తు చేసుకోనే అవకాశం వుందన్నారు. ఈ పథకానికి మహిళలు మాత్రమే అర్హులని అన్నారు,

లైంగిక వేధింపులను నివారిద్దాం

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఫీరోజా బేగం ఆధ్వర్యంలో రాష్ట్రీయ బాల ఆరోగ్య కార్యక్రమం జిల్లా అధికారి డాక్టర్ నివేదిత బాలల లైంగిక వేధింపుల నివారణపై శిక్షణా తరగతులు- అవగాహన కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. చైల్డ్ ప్రొటెక్షన్ అత్యవసర సహాయ టోల్ ఫ్రీ నంబర్స్ ఉపయోగించు కోవాలని సూచించారు. తల్లిదండ్రులు పిల్లలతో స్నేహపూర్వకంగా ఉండి, వారు ఏవైనా సమస్యలను స్వేచ్ఛగా చెప్పుకునేలా చూడాలని సూచించారు. డిఈఐసి చైల్డ్ అండ్ క్లినికల్ సైకాలజిస్ట్ సిరిగిరి సుందర్ రావు శిక్షణ తరగతులు నిర్వహించారు. డాక్టర్ . నివేదిత చిన్నపిల్లలపై జరుగుతున్న అత్యాచారాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో మహిళా, శిశు సంక్షేమ శాఖ, విద్యాశాఖ ప్రతినిధులు, జువెనైల్ శాఖ వికలాంగుల శాఖ, సెకండరీ , ఒకేషనల్ విద్యా శాఖ, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఏప్రిల్ లోగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేస్తే అదనపు నిధులు

కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - పుట్టపర్తి అర్బన్

ఈ ఏడాది ఏప్రిల్ లోపు ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకున్న వారికి ప్రభుత్వం అదనంగా నిధులు మంజూరు చేస్తుందని జిల్లా కలెక్టర్ టిఎస్. చేతన్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్ నుంచి ఒక ప్రకటన విడుదల అయింది. 2016 నుంచి 2021 - 23 వరకు మంజూరైన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో అసంపూర్తిగా ఉన్నాయి. అలాంటి లబ్ధిదారులకు ప్రభుత్వం ఎస్సీ,బీసీలకు రూ. 50వేలు, ఎస్టీలకు రూ. 75వేలు అదనంగా నిధులు మంజూరు చేస్తుందని కలెక్టర్ తెలిపారు. జిల్లాలో 71,969 ఇల్లు మంజూరు కాగా ఇందులో 25,203 ఇల్లు పూర్తి అయ్యాయని మిగిలిన నిర్మాణాలు వివిధ దశల్లో ఉన్నాయని తెలిపారు. వివిధ దశల్లో 16,123 గృహాలు ఉన్నాయని వాటిని ఏప్రిల్ నెలలోపు పూర్తి చేసుకుంటే వారికి అదనపు నిధులు మంజూరవుతాయని చెప్పారు. ఈనెల 15 నుంచి 23వ తేదీ వరకు ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వార్డు కమ్యూనిటీ కార్యదర్శులు అర్హత కలిగిన ప్రతి ఇంటిని పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని సూచించారు. ఇంటి నిర్మాణాలను ఫోటోలు తీసి నివేదిక పంపాలన్నారు. మున్సిపల్ కమిషనర్లు ,ఎంపీడీవో లు ప్రత్యేక దృష్టి పెట్టి సంబంధిత అధికారులతో విస్తృత ప్రచారం నిర్వహించి ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేయడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

విద్యార్థులు, యువతకు కూటమి మోసం

'యువత పోరు'లో వైసిపి నాయకులు - పాల్గొన్న మాజీ ఎమ్మెల్యేలు, నాయకులు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

విద్యార్థులు, యువతకు ఎన్నికల ముందు అనేక హామీలిచ్చిన కూటమి నాయకులు అధికారంలోకి వచ్చాక ఏ ఒక్కటీ నెరవేర్చకుండా మోసం చేశారని వైసిపి నాయకులు విమర్శించారు. విద్యార్థి, యువత సమస్యల పరిష్కారం కోరుతూ వైసిపి ఆధ్వర్యంలో పుట్టపర్తిలో 'యువత పోరు' కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అక్కడ జరిగిన ఆందోళన కార్యక్రమంలో వైసిపి ముఖ్య నాయకులు ప్రసంగించారు. ఈ సందర్భంగా వైసిపి జిల్లా అధ్యక్షురాలు ఉషశ్రీచరణ్ మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, విద్యా దీవెన, వసతి దీవెన ఇవ్వకుండా కూటమి ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం చేస్తోందన్నారు. యువతకు నిరుద్యోగ భృతి చెల్లిస్తామని హామీ ఇచ్చి దానిని పట్టించుకోలేదన్నారు. అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే కూటమి ప్రభుత్వం ప్రజా వ్యతిరేకతను చవిచూస్తోందని చెప్పారు. సూపర్ సిక్స్ పథకాలు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా సుమారు 11 లక్షల మంది విద్యార్థులు ఫీజురీయింబర్స్ మెంట్ అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఫీజులు చెల్లించేందుకు తల్లిదండ్రులు అప్పులు చేయాల్సి వస్తోందన్నారు. మెడికల్ కళాశాలలను ప్రయివేటీకరించేందుకు యత్నిస్తోందన్నారు. కూటమి నేతలు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ ప్రకారం నిరుద్యోగ భతి ఇవ్వాలన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, వసతి దీవెన తదితర వాటికి గత ఏడాది బకాయిలతో పాటు చెల్లించాలన్నారు. మెడికల్ కళాశాలల ప్రయివేటీకరణను తక్షణం ఆపాలని డిమాండ్ చేశారు.

కలెక్టరేట్ వద్ద ఆందోళన చేస్తున్న వైసిపి శ్రేణులు

జాయింట్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

అనంతరం కలెక్టరేట్‌లో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్‌ను కలిసి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో వైసిపి నియోజకవర్గ సమన్వయ కర్తలు దుద్దుకుంట శ్రీధర్ రెడ్డి, కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి, తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి, ఈరలక్కప్ప, దీపిక, మక్బూల్ బాషాతో పాటు వైసిపి శ్రేణులు పాల్గొన్నాయి.

పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

కరపత్రాలను విడుదల చేస్తున్న గ్రామపంచాయతీ కార్మికులు

ప్రజాశక్తి - చిలమత్తూరు

గ్రామపంచాయతీ, స్వచ్ఛ భారత్ కార్మికులు సమస్యలు పరిష్కారం కోసం ఈనెల 17న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమం జయప్రదం చేయాలని ఏపీ గ్రామపంచాయతీ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి రమేష్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మండల కేంద్రం, కోడూరు గ్రామ పంచాయతీల్లో చలో విజయవాడ కరపత్రాలు పంపిణీ చేశారు. అనంతరం కార్మికులతో కార్యాలయం లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులు ఏళ్ల తరబడి ప్రజలకు అనేక సేవలు అందిస్తూ పర్యావరణ కాపాడడంలో కీలకపాత్ర పోషిస్తున్నారన్నారు. అలాంటి వారికి వేతనాలు పెంచకుండా బానిసలుగా తయారు చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇప్పటికైనా తమతీరును మార్చుకోవాలన్నారు. తెలంగాణ ప్రభుత్వం మాదిరిగా ఎపి ప్రభుత్వం కూడా నేరుగా కార్మికుల ఖాతాల్లోకి వేతనాలు వేయాలన్నారు. కూటమి ప్రభుత్వం వచ్చాక వందలాది మంది కార్మికులను అక్రమంగా తొలగించారు. ప్రస్తుతం అసెంబ్లీ సమావేశాల్లో ఉప ముఖ్యమంత్రి, పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ పంచాయతీ కార్మికుల ఊసెత్తడం లేదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు మండల కన్వీనర్ రామచంద్ర, రైతు సంఘం నాయకులు లక్ష్మీనారాయణ, గ్రామపంచాయతీ కార్మికుల యూనియన్ నాయకులు గౌస్, చలపతి, రఫిక్, నరసింహప్ప, వేమారెడ్డి, నాగప్ప, ఆదిలక్ష్మి, రత్నమ్మ, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల వలయంలో సంక్షేమ వసతిగృహం

నీటి కొళాయి వద్ద నెలకొన్న అపరిశుభ్రత

అధ్వానంగా ఉన్న బాత్రూం

ప్రజాశక్తి - కదిరి టౌన్

కదిరిలోని ప్రభుత్వ వసతి గృహంలో సరైన వసతి సౌకర్యాలు లేక విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారు. పట్టించుకోవాల్సిన ఉన్నత అధికారులు ఆ దిశగా అడుగులు వేయకపోవడంతో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. కదిరి పట్టణంలోని బిసి సంక్షేమశాఖ అధికారి కార్యాలయం పక్కన బాలుర వసతి గృహంలో సమస్యలు రాజ్యమేలుతున్నాయి. అద్దెభవనంలో కొనసాగుతున్న ఈ హాస్టల్‌లో కనీస సౌకర్యాలు లేవు. హాస్టల్‌లో ఉన్న 180 మంది విద్యార్థులకు సరిపడా మరుగు దొడ్లు లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ. 40 వేలు అద్దె చెల్లిస్తునా సరైన వసతులు కల్పించడంలో యజమాని నిర్లక్ష్యం వహిస్తున్నారు. కనీస వసతులైన పడుకోవడానికి సరైన హాల్, మరుగుదొడ్లు, స్నానపు గదులు లేక తీవ్ర అసౌకర్యాలు నడుమ ఉండాల్సిన దుస్థితి దాపరించినట్లు విద్యార్థులు వాపోతున్నారు. మరుగుదొడ్లకు కనీసం డోర్లు లేవంటున్నారు. విద్యార్థుల సమస్యలను పరిష్కరించడంలో అధికారులు విఫలమయ్యారన్న విమర్శలు వినపడుతున్నాయి. 9వ తరగతి విద్యార్థి ప్రవీణ్ మాట్లాడుతూ విద్యార్థులందరికీ కేవలం మూడు మరుగు దొడ్లు మాత్రమే ఉన్నాయన్నారు. దీంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ నాయకులు బాబ్జాన్ మాట్లాడుతూ వసతిగృహంలోని విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు. వారి సమస్యల పరిష్కారంలో అధికారులు తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యార్థుల ఇబ్బందిని దష్టిలో ఉంచుకొని తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీని ఆదర్శంగా నిలుపుదాం

జిల్లా రవాణా అధికారి టి. మధుసూదన్

ప్రజాశక్తి - పుట్టపర్తి క్రైమ్

జిల్లాలో ఆర్టీసీని ఆదర్శంగా తీర్చిదిద్ది రాష్ట్రంలో ప్రథమ స్థాయిలో నిలపడానికి అందరూ కృషి చేద్దామని జిల్లా రవాణా శాఖ అధికారి టి మధుసూదన్ పిలుపునిచ్చారు. బుధవారం జిల్లా రవాణా శాఖ కార్యాలయంలో అన్ని డిపోల మేనేజర్లు, సూపర్వైజర్లు, ట్రాఫిక్, గ్యారేజీ, అకౌంట్స్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆర్టీసీ ఆదాయాన్ని వృద్ధిచేసి జిల్లాను ప్రథమ స్థానంలో నిలిపేందుకు అందరు కృషి చేయాలన్నారు. ముఖ్యంగా దూర ప్రాంతాలకు వెళ్లే ప్రయాణికులకు ఇబ్బంది కలగకుండా బస్సులను ఎప్పటికప్పుడు పరిశీలించాలన్నారు. అదేవిధంగా ప్రయాణికుల నుంచి వచ్చే ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. బస్సులలో కెఎంపిఎల్ ను పెంచి బ్రేక్ డౌన్ లను తగ్గించి ప్రయాణికులను సురక్షితంగా గమ్యాలకు చేర్చాలన్నారు. కదిరి బ్రహ్మోత్సవాలకు జిల్లా నలుమూలల నుంచి 30 ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్టీసీ అధికారి

ఖాతాదారులకు మెరుగైన సేవలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

తమ బ్యాంకులో ఖాతాదారులకు మెరుగైన సేవలు అందిస్తున్నామనికెనరా బ్యాంక్ ఎజిఎం లారెన్స్ పేర్కొన్నారు. కెనరా బ్యాంక్ 50 ఏళ్ల వజ్రోత్సవ వేడుకలను పురస్కరించుకొని బుధవారం చిలమత్తూరు సిండికేట్ బ్యాంక్ ఆవరణంలో ఖాతాదారుల సమావేశం ఏర్పాటు చేశారు. స్థానిక కెనరా బ్యాంకులో 27 వేల మంది ఖాతాదారులు ఉన్నారని, వారికి అవసరమైన సేవలు అందిస్తూ 50 ఏళ్లుగా ఎలాంటి సమస్య తలెత్తకుండా ముందుకెళ్తున్నామని అన్నారు. బ్యాంకులో 6 వేల మందికి పైగా రైతులు వ్యవసాయ రుణాలు పొందారని, బంగారం, విద్య, పర్సనల్, వ్యాపార రుణాలు, పరిశ్రమలకు భారీగా రుణాలు అందిస్తున్నామన్నారు. మహిళలు రూ. 5 వేల రూపాయలతో ఏంజిల్ ఖాతా ప్రారంభిస్తే వారికి రూ. 3 లక్షల వరకు క్యాన్సర్ ట్రీట్మెంట్ కు బీమా సదుపాయం ఉంటుందన్నారు. డిపాజిట్ మొత్తం పెరిగే కొద్దీ బీమా మొత్తం కూడా పెరగనుందన్నారు. ఇక 17 నుంచి 28 సంవత్సరాల్లోపు విద్యార్థులకు తక్కువ వడ్డీకే విద్యా రుణాన్ని అందజేస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ షేక్ షాజీద్, బ్యాంక్ సిబ్బంది, ఖాతాదారులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

సింహ వాహనంపై నారసింహుడు

ప్రజాశక్తి - కదిరి అర్బన్

ఖాద్రి లక్ష్మీనరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా నారసింహుడు బుధవారం రాత్రి సింహ వాహనంపై తిరుమాడ వీధుల్లో భక్తులకు దర్శనమిచ్చారు. చేతిలో వీణ, విశేష దివ్యాభరణాలు, పట్టు పీతాంబరాలు ధరించి తిరువీధుల్లో ఊరేగుతున్న శ్రీవారిని భక్తులు దర్శించుకున్నారు. నారసింహుడు హంస వాహనాన్ని అధిరోహించి తిరువీధుల్లో దర్శనమిచ్చారు. బ్రహ్మోత్సవాల్లో భాగంగా శ్రీవారు గురువారం హనుమంత వాహనంపై దర్శనమివ్వనున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో శ్రీనివాస్ రెడ్డి ఆర్డీవో వివిఎస్ శర్మ, భక్తులు పాల్గొన్నారు. ఉత్సవాలలో ఎలాంటి సంఘటనలు చోటు చేసుకోకుండా డీఎస్పీ శివ నారాయణ స్వామి ఆధ్వర్యంలో పట్టణ సిఐ నారాయణరెడ్డి ఎస్ఐ బాబ్జాన్ సమక్షంలో పోలీసులు బందోబస్తు నిర్వహించారు.

విద్యార్థులు, యువతకు కూటమి మోసం

పంట నమోదుతో రైతులకు సంక్షేమ పథకాలు : కలెక్టర్

రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ టిఎస్. చేతన్

ప్రజాశక్తి - బుక్కపట్నం

ప్రతి రైతు పంట నమోదు చేసుకొని సంక్షేమ పథకాలు పొందాలని జిల్లా కలెక్టర్ చేతన్ పేర్కొన్నారు. మండల వ్యాప్తంగా 2024, 25 సంవత్సరానికి గాను 3774 ఎకరాల విస్తీర్ణం లో వేరుశనగ, మొక్కజొన్న, వరి తదితర సాగు చేసిన పంటలను పంటలను పంట నమోదు చేయగా సూపర్ చెక్ పవర్ కింద బుధవారం మండల కేంద్రం తోపాటు, మండల పరిధిలోని సిద్దరాంపురం గ్రామంలోని పంట పొలాలను అధికారలుఌ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని, ప్రతి రైతు తమ పంట నమోదును తప్పక నమోదు చేసుకోవాలని సూచించారు. పంట నమోదు ద్వారా రైతు సంక్షేమ పథకాలు పొందవచ్చని తెలిపారు. అనంతరం పంట సాగు, పంట దిగుబడి, పంట పెట్టుబడి, ఎరువులు వాడకం వంటి తదితరాంశాలపై రైతులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రైతులు పెట్టుబడులపై కలెక్టర్ కు వివరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి వై వి సుబ్బారావు , ఏడీ స్వయంప్రభ, తహశీల్దార్ షాబుద్దీన్, మండల వ్యవసాయ అధికారి సతీష్ బాబు, ఆర్‌బికె సిబ్బంది గంగాధర్, ఆశాజ్యోతి, సుధాకర్ నాయక్, వీఆర్వోలు సురేష్, వేణుగోపాల్ రైతులు పాల్గొన్నారు.

కొత్త చెరువు రూరల్: నీటి వసతి తక్కువగా ఉన్న ప్రాంతాలలో, మెట్ట భూములలో రైతులు మునగ పంట వేయాలని జిల్లా కలెక్టర్ టీఎస్ చేతన్ రైతులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు ఆయన బుధవారం కొత్తచెరువు మండలంలో ఈ క్రాప్ నమోదుపై నిర్వహించిన సూపర్ చెక్ కార్యక్రమంలో పాల్గొని రైతులతో సమీక్షించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ శాఖ అధికారి ఏ సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు. కొత్తచెరువు మండలం కే లోచేర్ల పి సరోజిని వరి పంట పొలాన్ని కలెక్టర్ పరిశీలించారు, ఆయా ప్రాంతాల రైతులతో మాట్లాడుతూ ఆరుతడి పంటల వల్ల భూగర్భ జిల్లాలో పొదుపు చేయడమే కాక ఎక్కువ ఆదాయాన్ని పొందవచ్చునని చెప్పారు. మార్కెట్లో డిమాండ్ ఉన్న పంటలు సాగు చేయాలన్నారు. నీటి వసతి తక్కువగా ఉన్న ప్రాంతాలలో, మెట్ట భూములలో రైతులు మునగ పంట వేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

10 ఎకరాల వరకు రాయితీ వర్తింపజేయాలి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

శ్రీ సత్య సాయి, అనంతపురం జిల్లా రైతాంగానికి వ్యవసాయ సంక్షేమ పథకాలలో ప్రత్యేక మినహాయింపు ఇచ్చి 10 ఎకరాల వరకు వర్తింపజేసేలా ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వుల ఇవ్వాలని పుట్టపర్తి నియోజకవర్గ ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి కోరారు. శాసనసభ సమావేశాల సందర్భంగా బుధవారం జీరో ఆవర్ లో ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగ సమస్యలను పుట్టపర్తి ఎమ్మెల్యే ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. 2014 నుంచి 2019 వరకు అప్పటి తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రైతులను ఆదుకోవాలనే సంకల్పంతో అనంతపురం ఉమ్మడి జిల్లాను ప్రత్యేక దృష్టితో చూస్తూ వ్యవసాయ పరికరాలను పెద్ద రైతులకు 90 శాతం సబ్సిడీతో 10 ఎకరాల వరకు వర్తించేలా ఉత్తర్వులు ఇచ్చిన విషయాన్ని ఎమ్మెల్యే ప్రస్తావించారు. గత వైసిపి పాలనలో పెద్ద రైతులకు 45 శాతం సబ్సిడీతో మిగతా ఎస్సీ , ఎస్టీ రైతులకు 50శాతం రాయితీ తో వ్యవసాయ పరికరాలను అందించారన్నారు. దీంతో ఈ ఉమ్మడి జిల్లాల్లో వ్యవసాయ రంగం పూర్తిగా సంక్షోభంలోకి వెళ్లిపోయి అన్నదాతలు అప్పుల్లో కూరుకపోయారని ఎమ్మెల్యే ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లాను హార్టికల్చర్ హబ్ గా మార్చాలనే ఆలోచనతో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ముందుకు సాగుతున్నారని , ఆ దిశగా అన్నదాతలు అడుగులు వేయాలంటే సత్యసాయి ,అనంతపురం ఉమ్మడి జిల్లా రైతాంగం ప్రయోజనాల కోసం ఒకొక్క రైతుకు 10 ఎకరాల వరకు వ్యవసాయ రంగంలో మినహాయింపు ఇవ్వాలని కోరారు. అలాగే వ్యవసాయ రంగంలో పెద్ద రైతులకు 90శాతం, ఎస్సీ ఎస్టీలకు వందశాతం రాయితీతో డ్రిప్పు, స్ప్రింకర్లు,వ్యవసాయ పరికరాలు అందించే విధంగా ప్రభుత్వం ప్రత్యేక ఉత్తర్వులు ఇవ్వాలని ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. ఎమ్మెల్యే ప్రశ్నకు వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు మాట్లాడుతూ ఇది రైతు సంక్షేమ ప్రభుత్వమని అన్నారు. రాయలసీమకు ముఖ్యంగా ఉమ్మడి అనంతపురం జిల్లా రైతాంగ ప్రయోజనాల కోసం ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తుందని పేర్కొన్నారు.

అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లె సింధూర

నీటి సమస్య తలెత్తనివ్వొద్దు

సమావేశంలో మాట్లాడుతున్న చైర్మన్ రమేష్ కుమార్

ప్రజాశక్తి-హిందూపురం

వేసవిలో పట్టణవ్యాప్తంగా ఎక్కడ నీటి సమస్య తలెత్తకుండా ముందస్తు చర్యలను చేపట్టాలని నీటి సరఫరా విభాగం అధికారులను మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు ఆయన కమిషనర్ సంఘం శ్రీనివాసులతో కలిసి నీటి సరఫరా విభాగంపై సిబ్బందితో సమీక్షా సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ మాట్లాడుతూ గొల్లపల్లి నుంచి హిందూపురానికి పూర్తిస్థాయిలో నీటి సరఫరా జరుగుతున్నప్పటికీ కొంతమంది సిబ్బంది నిర్లక్ష్యం వల్ల పలు వార్డుల్లో నీటి సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందన్నారు. నీటి సరఫరా విషయంలో సిబ్బంది నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే కఠిన చర్యలు తీసుకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు. పైప్ లైన్ లేని ప్రాంతాలను గుర్తించి ఆ ప్రాంతాలకు ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. ముఖ్యంగా వార్డు స్థాయిలో విధులు నిర్వహిస్తున్న కమ్యూనిటీ సెక్రటరీలు, ఫిట్టర్ లు, వాటర్ మ్యాన్లు ఎప్పటికప్పుడు వారి పరిధిలో పైప్ లైన్ నిర్వహణపై పరిశీలన చేస్తూ ఉండాలన్నారు. ఈ సమీక్షలో డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ మోహన్, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలకు వాటర్‌ప్లాంట్ అందజేత

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని కెఎన్ పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు కెనరాబ్యాంకు సామాజిక బాధ్యతలో భాగంగా గుడిబండ కెనరా బ్యాంక్ శాఖ తరపున వాటర్‌ప్లాంట్‌ను అందజేశారు. రూ.90వేల విలువ చేసే వాటర్‌ప్లాంట్‌ను, గ్రంథాలయానికి అవసరమయ్యే దాదాపు 20వేల రూపాయలు విలువ చేసే టేబుళ్లను గుడిబండ కెనరా బ్యాంక్ సీనియర్ మేనేజర్ మల్లయ్య చేతుల మీదుగా బుధవారం అందజేసి ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో బ్యాంకు మేనేజర్ సాయి సిద్ధార్థ, పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభాకర్ రెడ్డి,ఆ పాఠశాల విద్యా కమిటీ ఛైర్‌పర్సన్ రాధమ్మ , ఉపాధ్యాయులు బ్యాంకు సిబ్బంది,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

వాటర్‌ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న బ్యాంకు అధికారులు

నాయకులతో మాట్లాడుతున్న పరిటాల శ్రీరామ్

ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం : పరిటాల

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ పేర్కొన్నారు. ఈ మేరకు ఆయన బుధవారం స్థానిక టీడీపీ కార్యాలయంలో ప్రజలు కార్యకర్తలతో సమావేశమై ప్రజాసమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా కాలనీల్లో ఇంటింటికీ చెత్త సేకరణ జరగడం లేదని, డ్రైనేజీలు శుభ్రం చేయలేదని, చేనేతలకు కరెంటు సబ్సిడీ అందడం లేదని పలువురు ఫిర్యాదు చేశారు. 8వ వార్డులో రైల్వే సరిహద్దు గోడ నిర్మాణం, సీసీ కాల్వ నిర్మాణం, మరణ ధ్రువీకరణ పత్రాలు మంజూరులో ఆలస్యం వంటి సమస్యలు శ్రీరామ్ దృష్టికి తీసుకెళ్లారు. అధికారులతో మాట్లాడి వీటి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమం లో తెలుగుదేశం నాయకులు పరిసే సుధాకర్, మాధవరెడ్డి అత్తర్ రహీం బాషా, అంబటి సనత్, ప్రసాద్ నాయుడు తదితరులు పాల్గొన్నారు.

మన పిల్లలను మనమే రక్షించుకోవాలి : ఆర్డీవో

ప్రజాశక్తి - పుట్టపర్తి రూరల్

మన పిల్లలను మనమే రక్షించుకోవాలని ఏ పిల్లలు అయితే తల్లితండ్రుల ప్రేమ ఆప్యాయతకి నోచుకోరో వారు పక్కదారి పట్టే ప్రమాదంఉందని పుట్టపర్తి ఆర్డీవో సువర్ణ పేర్కొన్నారు . బుధవారం మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ సమితి , చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో పిల్లలు శారీరక, మానసిక ఉద్రేకం కలిగించే అంశాలు, బాలల న్యాయ చట్టం,బాల్య వివాహాలు నిలుపుదల గురించి పుట్టపర్తి ఎంపిడిఒ కార్యాలయంలో మహిళా పోలీసులు, పంచాయతీ కార్యదర్శులకు ఒకరోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆర్డీవో మాట్లాడుతూ పిల్లలను ప్రభావితం చేసే అంశాలు మన చుట్టూ చాలా ఉన్నాయన్నారు. వాటి గురించి మహిళా పోలీసులు తెలుసుకుని పిల్లలను వాటి నుండి రక్షించవలసిన అవసరం ఉందని సూచించారు. ముఖ్యంగా బాలికలు లైంగిక వేధింపులకు గురి కాకుండా చూసుకోవాల్సిన బాధ్యతను గుర్తు చేశారు. బాల్య వివాహాలు నిలుపుదలలో పంచాయతీ స్థాయిలో ఉన్న అధికారులు కలిసి మెలిసి పని చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో మహిళా శిశు సంక్షేమ శాఖ ప్రాజెక్ట్ డైరెక్టర్ సుధా వరలక్ష్మి , డిసిపిఒ మహేష్, చిల్డ్రన్ ఆఫ్ ఇండియా ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ కొండప్ప, ప్రొటెక్షన్ ఆఫీసర్ నాగలక్ష్మి, సోసియల్ వర్కర్ ఆనంద్, వనజాక్షి, లక్ష్మీప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో

ఫీజు బకాయిల నేరం జగన్ రెడ్డిదే : టిడిపి

ప్రజాశక్తి - మడకశిర

ఫీజు బకాయిల నేరం జగన్‌రెడ్డిదే అని టిడిపి నాయకులు, బిసి సాధికారిక కుంచిత ఒక్కలిగ రాష్ట్ర కన్వీనర్ విఎం. పాండురంగప్ప విమర్శించారు. ఈసందర్భంగా ఆయన బుధవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ నాయకులు చేస్తోంది యువత పోరు కాదని విద్యార్థులపై దండయాత్ర అని అన్నారు. జగన్ రెడ్డి నిరంకుశ పాలన వల్లే రూ. 4720 కోట్ల ఫీజు బకాయిలున్నాయన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ విద్యార్థులపై కక్షతోనే జగన్ రెడ్డి ఇలా వ్యవహరించారని ఆరోపించారు. వైసిపి నాయకులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ గురించి మాట్లాడే నైతిక హక్కు లేదని అన్నారు. జీవో నెం.77 తీసుకొచ్చింది జగన్ రెడ్డి కాదా అని ప్రశ్నించారు. ఇప్పుడు అదే జీవో ను రద్దు చేయాలనడం దారుణం అని అన్నారు. వైసిపి నాయకులకు నిజంగా విద్యార్థుల పట్ల చిత్తశుద్ధి ఉంటే యువత పోరు బాట సైకో జగన్ ప్యాలెస్ ముందు చేయాలన్నారు. విద్యార్థుల భవిష్యత్తు పట్ల కూటమి ప్రభుత్వం అత్యంత చిత్తశుద్ధితో పనిచేస్తోందని అన్నారు.

గుడిబండ : జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం విద్యార్థులకు వ్యతిరేకంగా 77 జీవోను తీసుకొచ్చి విద్యార్థుల బ్రతుకులను బుగ్గిపాలు చేసిందని టిఎన్ఎస్ఎఫ్ తాలూకు అధ్యక్షులు జవనడుకు రంగా విమర్శించారు. ఈ మేరకు ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జగన్మోహన్ రెడ్డి విద్యా దీవెన,వసతి దీవెన బకాయిలు చెల్లించకుండా విద్యార్థులను మోసం చేశారన్నారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వంపై బురద జల్లడానికి జగన్మోహన్ రెడ్డి యువత పోరుబాట అనే కార్యక్రమంతో కొత్త డ్రామాకు తెరలేపారని విమర్శించారు. ఇప్పటికైనా జగన్మోహన్ రెడ్డి, వైసిపి నాయకులు విద్యార్థుల పట్ల కపట ప్రేమ చూపడం మాని విద్యార్థుల భవిష్యత్తుకు కూటమి ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

విద్యార్థులకు పరీక్షల సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - మడకశిర

మండల పరిధిలోని రేకులకుంట ఉన్నత పాఠశాలకు చెందిన పదవ తరగతి విద్యార్థులకు భౌతిక శాస్త్ర ఉపాధ్యాయురాలు విజయ భార్గవి పరీక్షల సామాగ్రిని బుధవారం అందజేశారు. అట్ట, పెన్ను, పెన్సిలు, స్కేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రొద్దం : మండలంలోని పెద్దగువ్వలపల్లి ప్రభుత్వ హై స్కూల్‌కు చెందిన పదోతరగతి విద్యార్థులకు పాఠశాల ఉపాధ్యాయులు అట్టలు పంపిణీ చేశారు. అదే విధంగా మండలంలోని తురకలపట్నం ప్రభుత్వ హై స్కూల్ 10వ తరగతి విద్యార్థులు సరస్వతి పూజ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు పరీక్ష సామాగ్రిని సీనియర్ న్యాయవాది అందజేశారు. ఈ కార్యక్రమంలో వైసిపి లీగల్ సెల్ లీగల్ సెల్ సెక్రెటరీ నాగరాజు, న్యాయవాదులు ఎన్వీ శివశర్మ, సుబ్రమణ్య శాస్త్రి, న్యాయ విద్యార్థి లిఖిత, ప్రధానోపాధ్యాయులు శివరాం, టీచర్లు అన్నపూర్ణ, శ్రీనివాసులు, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

యానిమేటర్లకు శిక్షణ

ప్రజాశక్తి - మడకశిర

నియోజకవర్గ పరిధిలోని అమరాపురం హేమ మండల సమాఖ్యలో బుధవారం మండలంలోని యానిమేటర్లకు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. లోకోస్ వెబ్ సైట్ నందు ఆర్థిక లావాదేవీల నమోదుపై నిర్వహించిన శిక్షణా కార్యక్రమానికి ప్రాజెక్ట్ డైరెక్టర్ కె.యన్.నరసయ్య. హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన ప్రాజెక్ట్ కార్యక్రమాల ప్రగతిపై సమీక్షించారు. గ్రామ సంఘంలోని యానిమేటర్ల విధులు, బాధ్యతల గురించి వివరించారు. ఈ శిక్షణా కార్యక్రమంలో మండల సమాఖ్య కోశాధికారి సుమ, సిసిలు, అకౌంటెంట్, యానిమేటర్లు తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి చెత్త సేకరణ

ప్రజాశక్తి - గాండ్లపెంట

మండల కేంద్రంలోని పూసల వీధి, గంగాభవాని వీధి తదితర వీధుల్లో బుధవారం ఇంటింటి చెత్త సేకరణ నిర్వహించారు. ఈసందర్భంగా ఈవోఆర్డీ సునీత మాట్లాడుతూ ప్రతి ఇంటి వద్ద పొడి చెత్త తడి చెత్త హానికర చెత్తను సేకరించి చెత్త కేంద్రాల్లో వర్మీకంపోస్టు తయారు చేస్తామని ఆమె తెలిపారు ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి సయ్యద్‌బాషా, మండల రిసోర్స్ కోఆర్డినేటర్ సి ఎస్ ఇలియాస్, పంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యానవనం ఏర్పాటు

ప్రజాశక్తి - చిలమత్తూరు

మండల కేంద్రంలోని శ్రీ పొట్టి శ్రీరాములు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉద్యానవనం ఏర్పాటు చేశారు. పాఠశాల 70వ వసంతంలోకి అడుగు పెడుతున్న సందర్భంగా ఈ ఉద్యానవనాన్ని ఏర్పాటు చేశామని పాఠశాల ప్రధానోపాధ్యాయులు వివేకానంద మూర్తి తెలిపారు. పాఠశాల పేరును 3డి ఆకృతిలో తీర్చిదిద్దారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కమిటీ ఛైర్మన్ జగదీష్, ఉపాధ్యాయులు రాఘవేంద్ర, పెద్దారెడ్డి, రత్నమయ్య, ఉమ మహేశ్వర్, హర్షవర్ధన్, మాధవి, పద్మ తదితరులు పాల్గొన్నారు.

14న పౌర్ణమి గరుడ సేవ

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

ధర్మవరం బ్రాహ్మణ వీధిలో గల శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో ఈనెల 14న పౌర్ణమి గరుడ సేవను నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, ఈవో వెంకటేశులు, అన్నమయ్య సేవా మండలి అధ్యక్షులు పోరాల్ల పుల్లయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా ఈ పౌర్ణమి గరుడ సేవను నిర్వహిస్తున్నామన్నారు. ఈ పౌర్ణమి గరుడ సేవకు సేవాకర్తలుగా నాగరత్నమ్మ చెన్నం శెట్టి జగదీశ్వర ప్రసాద్, అఖిల, శ్రీలక్ష్మి, ఆదిత్య, అనూష, అద్వైత్ లు వ్యవహరిస్తున్నట్లు చెప్పారు.. ఈ వేడుకల్లో కోలాటం, అన్నమయ్య సేవా మండలి బృందంచే అన్నమయ్య సంకీర్తనలు ఉంటాయని తెలిపారు. అదే రోజు ఉదయం 10:30 గంటలకు శ్రీవారి కళ్యాణ మహోత్సవం వేడుకలు కూడా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సేవా కర్తలుగా ఇంద్రాణి గుర్రం శ్రీనివాసులు నవ్య శ్రీ గుర్రం బాలాజీ ఐశ్వర్య గుర్రం సుదర్శన్ గుర్రం హరినారాయణలు వ్యవహరిస్తారని తెలిపారు.

వైసిపి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి-హిందూపురం

పట్టణంలోని వైసీపీ కార్యాలయంలో బుధవారం పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి దీపిక ఆధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 15వ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. తొలత వైయస్ రాజశేఖర్ రెడ్డి చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించిన అనంతరం జెండా ఆవిష్కరణ చేశారు. అనంతరం కేక్ కట్ చేసి అందరికీ పంచారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బలరామిరెడ్డి, వైసిపి నాయకులు వేణు రెడ్డి, రాము, మహేష్ గౌడ్, జనార్దన్ రెడ్డి, రామ్మూర్తి, కవిత, సాహేరా బాను, పలువురు కౌన్సిలర్లతో పాటు పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

IN THE COURT OF THE ADDL.JUNIOR CIVIL JUDGE: DHARMAVARAM
O.S. No:550/2023

Between:
D.Gangadri ...Plaintiff
And
Sake Prabhakar ...Defendant

Notice to Defendant

To,
Sake Prabhakar S/o Late Narayanappa, R/at Venkatampalli Village, Chennekothapalli Mandal, Sri Satya Sai District.

పై నెంబరు కేసులో ప్రతివాది అయిన మీ హాజరు నిమిత్తము 17-03-2025వ తేది ఉదయం 10:30 గంIIలకు వాయిదా వేసినారు. ఆ రోజు మీరు స్వయంగా గానీ లేక వకీలు ద్వారా గానీ పై కోర్టులో హాజరై ఏమైన ఆక్షేపణలు తెలుపుకొనవలెను. లేని యెడల పై కేసు మీ పరోక్షమున తీర్మానించెదరు.

(కోర్టు ఉత్తర్వుల మేరకు)
M.Ramanjaneyulu, Advocate,
Dharmavaram. Cell:8639552234.

రేషన్ బియ్యం స్వాధీనం

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

స్వాధీనం చేసుకున్న బియ్యాన్ని చూపుతున్న పోలీసులు

ధర్మవరం మండల పరిధిలోని హైదరాబాద్ - బెంగళూరు హైవే సీతారాంపల్లి క్రాస్ వద్ద బుధవారం అక్రమంగా రేషన్ బియ్యం తరలిస్తున్న బోలోరో వాహన్నాన్ని సీజ్ చేసి ఇద్దరు వ్యక్తులను అదుపులో కి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ శ్రీనివాసులు తెలిపారు. వాహనాల తనిఖీలో భాగంగా అనంతపురం నుండి పెనుగొండ వైపు అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నామన్నారు.

నాటుసారా తయారీ నేరం

ప్రజాశక్తి - ముదిగుబ్బ

మండలంలోని అడవి బ్రాహ్మణపల్లి తండా, రాళ్ల అనంతపురం తండాలో ఎక్సైజ్ అధికారులు నవోదయం - 2 కార్యక్రమాన్నిబుధవారం నిర్వహించారు. ఎక్సైజ్ కమిషనర్ నరసింహులు, సిఐ చంద్రమణి, ఎస్ఐ నాగరాజు, ముదిగుబ్బ పోలీస్ స్టేషన్ ఎఎస్ఐ బాబు నాయక్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. నాటు సారా వల్ల జరిగే దుష్పరిణామాలతో పాటు వాటితో ప్రభుత్వం విధించే శిక్షలు జరిమానాలపై అవగాహన కల్పించారు. పదేపదే పట్టుబడే వారిపై పిడి యాక్ట్, జైలుశిక్ష విధిస్తారన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

ప్రజాశక్తి - చిలమత్తూరు

ఆటో డ్రైవర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు తప్పవని ఎస్ఐ మునీర్ అహ్మద్ హెచ్చరించారు. ఈ మేరకు ఆయన గార్మెంట్స్‌కు అధిక లోడుతో వెళ్తున్న ఆటోలను తనిఖీ చేశారు. ఆటో డ్రైవర్లు తప్పని సరిగా యునిపాం ధరించాలని, డ్రైవింగ్ లైసెన్స్, ఆర్.సి ఉండాలని ఆదేశించారు.

హెచ్‌ఎంపై డిఇఒకు ఫిర్యాదు

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని పిసి గిరి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఆంగ్ల ఉపాధ్యాయుడి వైఖరిపై ఆ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు డిఇఒకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయులు డిఇఒకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం, ఆంగ్ల ఉపాధ్యాయుడు కలసి తమను మానసికంగా వేధిస్తున్నారని వారు డిఇఒకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అత్యవసర సమయంలో సెలవు మంజూరు చేయడం లేదని వాపోయారు. ఇంక్రిమెంట్ ను సకాలంలో మంజూరు చేయక ఇంక్రిమెంట్ యొక్క అరియర్స్ బిల్లును పెట్టకుండా వేధిస్తున్నారని ఆరోపించారు. 2023 నుంచి ఇక్కడ పనిచేస్తున్న హెచ్‌ఎం ఉపాధ్యాయులను వేధిస్తోందని ఫిర్యాదు చేశారు. హెచ్‌ఎం అక్రమాలపై విచారణ చేసి న్యాయం చేయాలని పాఠశాల ఉపాధ్యాయులు డిఇఒను వినతిపత్రంలో కోరారు.

సిఎం సహాయనిధి చెక్కులు పంపిణీ

ప్రజాశక్తి - ధర్మవరం రూరల్

బాధితులకు మంజూరైన సిఎం సహాయ నిధి చెక్కులను టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి పరిటాల శ్రీరామ్ బుధవారం తన కార్యాలయంలో పంపిణీ చేశారు. మొత్తం రూ.1,47,295ల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పరిసే సుధాకర్, పోతుకుంట లక్ష్మన్న, కమతం కాటమయ్య, చింతలపల్లి మహేష్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

ఇన్‌ఛార్జి గ్రామ కార్యదర్శిగా రాంగోపాల్ రెడ్డి

ప్రజాశక్తి - కొత్తచెరువు

కొత్తచెరువు మేజర్ గ్రామపంచాయతీ ఇన్‌ఛార్జి కార్యదర్శిగా తలమర్ల గ్రామపంచాయతీ కార్యదర్శి రాంగోపాల్ రెడ్డి బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పనిచేస్తున్న శ్రీనివాస్ రెడ్డి సెలవుపై వెళ్లడంతో ఉన్నతాధికారులు రాంగోపాల్‌రెడ్డిని ఇన్‌ఛార్జిగా నియమించారు.

ఆర్‌డిఒ కార్యాలయం ముందు నిరసన

ప్రజాశక్తి -ధర్మవరం రూరల్

పట్టణ పరిధిలోని650-2 సర్వేనెంబర్‌లో ప్లంబర్లకు ఇచ్చిన ఇంటిస్థలాల్లో జరిగిన అక్రమాలపై విచారణ జరపాలని సిపిఐ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు వారు బుధవారం ధర్మవరం ఆర్డీవో కార్యాలయం ఎదుట ధర్నా కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సిపిఐ నియోజకవర్గ కార్యదర్శి ముసుగు మధు మాట్లాడుతూ ధర్మవరం పట్టణంలో సర్వేనెంబర్ 650-2 లో కొంతమంది నాయకులు దొంగ పట్టాలు తీసుకున్నారన్నారు. ప్లంబర్లు కాకపోయిన వారు అందరూ కూడా ప్రభుత్వ భూమిని అన్యక్రాంతం చేసుకుంటే అధికారులు, స్థానిక మంత్రి స్పందించకపోవడం పలు అనుమానాలకు తావిస్తోందన్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి విచారణ జరిపి పేదలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు పూలశెట్టి రవికుమార్, ఎర్రంశెట్టి రమణ, పోలా లక్ష్మీనారాయణ, వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

చలో పుట్టపర్తి

ప్రజాశక్తి - నల్లచెరువు

కదిరి నియోజకవర్గం వైసిపి సమన్వయ కర్త బిఎస్ మక్బూల్ ఆదేశాల మేరకు ఆపార్టీ మండల కన్వీనర్ రవికుమార్ రెడ్డి అధ్వర్యంలో బుధవారం చలో పుట్టపర్తి కార్యక్రమానికి తరలివెళ్లారు. ఫీజు పోరు కార్యక్రమానికి మండల పరిధిలో 13 పంచాయితీలలో ఉండే వైసిపి నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. అంతకు ముందు బస్టాండ్ కూడలిలో ఉన్న వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రమణారెడ్డి, మాజీ సర్పంచి అక్బర్, వైసీపీ నాయకులు పాల్గొన్నారు.

మడకశిర : వైసిపి చేపట్టిన యువత పోరు కార్యక్రమానికి ఆపార్టీ నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఈరక్కలప్ప ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. తొలుత వైఎస్ఆర్ విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి నివాళి అర్పించారు. అనంతరం యువత పోరుకు నియోజకవర్గం అన్ని మండలాల నుంచి భారీగా పార్టీ శ్రేణులు, యువత, విద్యార్థుల, నాయకులు తరలివెళ్లారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - గుడిబండ

మండలంలోని ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్నపలు సమస్యలను మండలంలోని యుటిఎఫ్ నాయకులు ఉపాధ్యాయులు కలిసి క్లస్టర్ ఛైర్మకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఒకే రోజు పాఠశాల మరియు క్లస్టర్ సమావేశం నిర్వహించడం ఉపాధ్యాయులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్నారు.ఉదయం 9 .12 గంటలకు పాఠశాలలో సమావేశాన్ని నిర్వహించి ఆ తర్వాత సుదూర ప్రాంతాల్లో ఉన్న క్లస్టర్ సమావేశానికి ఉపాధ్యాయులు హాజరు కాలేకపోతున్నారని అన్నారు. ఉన్న తక్కువ సమయంలో నైపుణ్యాలు పొందలేకపోతున్నామన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి ఈ విషయంపై పునరాలోచించి భవిష్యత్తులో జరిగే క్లస్టర్ సమావేశాన్ని ఒకరోజు పూర్తిగా కేటాయించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో యుటిఎఫ్ మండల ధ్యక్షులు ముట్లగిరియప్ప. ప్రధానకార్యదర్శి నరసింహప్ప, ఉపాధ్యాయులు నాగరాజు రెడ్డి, నేత్రజ, నాగేంద్ర, హేమలత తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను మహిళలకు వివరించండి

ప్రజాశక్తి-హిందూపురం

కూటమి ప్రభుత్వం ప్రజా సంక్షేమం కోసం తీసుకువచ్చిన ప్రజా సంక్షేమ పథకాల గురించి మహిళలకు వివరించి, అర్హులైన వారిని ఎంపిక చేసి వారికి సంక్షేమ పథకాలు అందే విధంగా చూడాలని మున్సిపల్ చైర్మన్ రమేష్ కుమార్ మెప్మా విభాగం అధికారులను ఆదేశించారు. మున్సిపల్ చైర్మన్ తన ఛాంబర్‌లో మెప్మా డీఎంసీ గంగులయ్య, కమ్యూనిటీ ఆర్గనైజర్లతో సమీక్ష సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా చైర్మన్ రమేష్ కుమార్ మాట్లాడుతూ మహిళలు ఆర్థిక అభివృద్ధి సాధించడానికి అవసరమైన చర్యలను తీసుకోవాలన్నారు. బ్యాంకు అధికారులతో చర్చించి విరివిగా రుణాలను సైతం ఇప్పించాలన్నారు. ఈ సమీక్షలో కురవ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ పరిమళ, మెప్మా సిఒలు తదితరులు పాల్గొన్నారు.